ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

మంగళవారం 18 నవంబరు 2025

న్యూస్ బాక్స్

25లోగా చేపపిల్లల సరఫరాకు దరఖాస్తులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లల సరఫరాకు ఆసక్తి గలవారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత సంవత్సరానికి చేప పిల్లల పంపిణీకి ఆసక్తి గల చేప పిల్లల సరఫరాదారులు జిల్లా టెండర్లలో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అలాగే సరఫరా కోసం ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. ఈనెల 18లోగా డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకొని, 19 వరకు ప్రీబిడ్‌కు సంబంధించిన సమావేశం అదనపు కలెక్టర్ ద్వారా జరుగుతుందని, 21న ఉదయం 10.30 గంటల నుంచి 25 మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్ దాఖలు చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సాగునీరు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

పెద్దపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలంలోని వివిధ ప్రాజెక్టుల కింద చేపట్టిన ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ధర్మారం మండలానికి సంబంధించి నీటిపారుదల పనులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ బొమ్మారెడ్డిపల్లి గ్రామంలో రెండు కాల్వలు నిర్మిస్తే మిగిలిన భూమికి సాగునీరు అందే అవకాశం ఉందని, దీనికి సంబంధించి సర్వే పూర్తి చేసి భూ సేకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ధర్మారం మండలంలో నీటి పారుదల ప్రాజెక్టు సంబంధించి ఆయకట్టు సాగు నీరు అందించేందుకు వీలుగా అవసరమైన కాల్వల నిర్మాణానికి పెండింగ్ భూ సేకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.

కుక్కల బెడదపై హైకోర్టులో రిట్

● కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు

మంథని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఇటీవల విపరీతంగా పెరగిన కుక్కల బెడదపై హైకోర్టులో న్యాయవాది, మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సత్యనారాయణ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం హైకోర్టు విచారించి ప్రతివాదులుగా ఉన్న కలెక్టర్, మంథని మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేసు విచారణను డిసెంబరు 8వ తేదీకి హైకోర్టు వాయిదా వేసినట్లు వెల్లడించారు.

అంబులెన్స్‌ల తనిఖీ

మంథని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాతా శిశువు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో 108, 102, 1962 అంబులెన్స్‌లను జిల్లా కో-ఆర్డినేటర్ జంపాల కుమారస్వామి సోమవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వివిధ వైద్య పరికరాలను, అత్యవసర మందులను, రికార్డులను ఆయన పరిశీలించారు. అత్యవసర సమయాల్లో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ మాళవిక, ఈఎంటీ భానుప్రసాద్, పైలెట్ మల్లేష్, కుమార్, పారవేట్ పాల్, రమేష్‌లు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ ఎస్ఐ బదిలీ

సుల్తానాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్‌ను బదిలీ చేస్తూ రామగుండం సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తానాబాద్ ఎస్ఐగా రామగుండం కమిషనరేట్‌లో సీసీఆర్బీ విధులు నిర్వహిస్తున్న చంద్రకుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్ డిపో పనులు షురూ..

- పూర్తి కావస్తున్న చెట్ల తొలగింపు
- సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు
- ఎనిమిది మాసాల్లో పూర్తి చేయాలని ప్రణాళిక



బస్ డిపో నిర్మించనున్న స్థలంలో నరికివేసిన చెట్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా కేంద్రానికి మంజూరైన ఆర్టీసీ బస్ డిపో నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ప్రతిపాదిత బస్ డిపో నిర్మాణ స్థలంలో గల 147 వివిధ రకాల చెట్ల నరికివేత పనులు పది రోజుల క్రితం చేపట్టగా దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. ఆ వెంటనే అక్కడ ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాల్లో, తమకు అవసరం ఉన్న వాటిని వదిలేసి, మిగతా వాటిని కూల్చి వేయనున్నారు. డిపో నిర్మాణానికి సుమా రు 6 కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ త్వరలోనే పనులను ఆరంభించాలని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఎని మిది మాసాల్లో డిపో నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రయాణికు లకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

నెరవేరనున్న దశాబ్దాల కల

పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రభుత్వాలకు ప్రజలు మొర పెట్టుకుంటున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలిస్తే పెద్దపల్లిలో బస్ డిపో ఏర్పాటు చేయిస్తానని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చింత కుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు. ఆ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద ఒత్తిడి తీసుకువచ్చి గత ఏడాది డిసెంబర్‌న బస్సు డిపో మంజూరు చేయించారు. డిసెంబర్ 4న జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నిర్వహించిన యువ వికాసం బహిరంగ సభకు హాజ రైన ముఖ్యమంత్రి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్ డిపో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికంటే ఒక రోజు ముందే ప్రభుత్వం డిపోను మంజూరు చేస్తూ ఉత్త ర్వులు జారీ చేసింది. పెద్దపల్లి బస్ స్టేషన్ ఆనుకొని ఉన్న 4 ఎకరాల 31 గుంటల స్థలంలో బస్ డిపో నిర్మిం చాలని నిర్ణయించారు. ఈ స్థలం ఆవరణలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం, స్వశక్తి కార్యాలయం, జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కార్యాలయం, సివిల్ సప్లై గోదాం, పంచాయతీ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం, తదితర కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. జనవరిలోనే భవనాలను ఖాళీ చేశారు. డిపో నిర్మాణానికి కావలసిన స్థలానికి నిబంధనల ప్రకారం టీజీఎస్ఆర్టిసి 14 కోట్ల 15 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేసి స్థలాన్ని ఆర్టీసీకి ఉచితంగానే అందజేసింది.

ఫిబ్రవరిలోనే టెండర్లు

బస్ డిపో నిర్మాణానికి మొదట ఆర్టీసీ 12 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్ల ప్రక్రియ మే నెలలో పూర్తి కావాల్సి ఉండగా, టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరు ఆసక్తి చూప లేదు. దీంతో మరోసారి జూన్‌లో టెండర్లను ఆహ్వా నించారు. పనులు చేసేందుకు ఒక కాంట్రాక్టర్ ముం దుకు వచ్చారు. పార్కింగ్ ఏరియాలో సిమెంట్ రోడ్లతో పాటు కాంపౌండ్ వాల్,

(మిగతా 8వ పేజీలో)

లింగాపూర్ సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్మన్ వెంకటయ్య

అంతర్గాం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం సందర్శించారు. లింగాపూర్‌లో లెదర్ పార్కు ఏర్పాటు కోసం నిర్ణయించిన ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం సింగరేణి ముంపు ప్రాంతమైన ఎస్సీ కాలనీవాసులకు పునరావాసం కోసం కేటాయించిన స్థలమని, దానిని లెదర్ పార్కు కోసం ఇవ్వవద్దని ఎస్సీ కాలనీవాసులు, గ్రామస్థులు చైర్మన్‌ను వేడుకున్నారు. ఎస్సీ కాలనీవాసుల సమస్యలు విన్న చైర్మన్, వారికి న్యాయం చేస్తానని పేర్కొన్నారు. లెదర్‌పార్క్ కోసం వేరే చోట స్థలం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు తెలుపుతానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీకి సమీపంలోనే సింగరేణి మట్టికుప్పలు, చెట్ల పొదలు ఉండటంతో గృహాల్లోకి అడవిపందులు, పాములు వస్తున్నాయని, సింగరేణి యాజమాన్యం తమకు పునరావాసం కల్పించేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందించారు. అనంతరం ప్రభుత్వ బాలికల గురుకుల కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రాంగణంలోగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోధన, వసతులు, సౌకర్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కళాశాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పంపును ప్రారంభించారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యం ఏర్పరుచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీఓ గంగయ్య, తహసీల్దార్ భూం రవీందర్, మాజీ సర్పంచ్ ఇరికిల్ల శంకరయ్య, నాయకులు రవి, కాసర్ల మల్లేష్‌లు వినతి పత్రం అందించారు. ప్రిన్సిపాల్ శారద, మాధవి పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే



మాట్లాడుతున్న జడ్జి భవానీ

మంథని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అరవై సంవత్సరాలు పైబడిన వృద్ధ తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలదేనని మంథని సీనియర్ సివిల్ జడ్జి వీ. భవానీ స్పష్టంచేశారు. కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవా అధికార సమితి ఆధ్వర్యంలో సోమవారం వృద్ధుల సంక్షేమ చట్టం-2007పై అవగాహన సమావేశంలో జడ్జి భవానీ మాట్లాడారు. తల్లిదండ్రుల పోషణను విస్మరించే పిల్లలకు వారి ఆస్తి చెల్లదన్నారు. ముందే తల్లిదండ్రుల ఆస్తి పొంది ఉంటే తిరిగి యాజమాన్యపు హక్కులు తల్లిదండ్రులకు చెందే విధంగా చట్టంలో పొందుపరిచారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు మాట్లాడుతూ.. నిర్లక్ష్యానికి గురైన వృద్ధులు ఆర్డీవోకి ఫిర్యాదు చేయడం ద్వారా పోషణ బాధ్యత హక్కులు పొందవచ్చన్నారు. ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. సయేందర్‌రెడ్డి, న్యాయవాది ఎస్. చంద్రశేఖర్, చంద్రుపట్ల సుధాకర్‌రెడ్డి, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, శశిభూషణ్‌కాచే, వ్యాస్ కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



బీ గెస్ట్ హౌస్ మూల మలుపు వద్ద పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్

కోల్‌సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని రామగుండం సీపీ అంబర్ కిశోర్‌ఝా అన్నారు. సోమవారం అరైవ్, అలైవ్ రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా సీపీ గోదావరిఖని బీ గెస్ట్‌హౌస్ మూలమలుపు నుంచి ఇందారం క్రాస్ రోడ్డు వరకు బ్లాక్ స్పాట్ లను సందర్శించారు.

ఆయన మాట్లాడుతూ రాజీవ్ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగడం వల్ల ఎన్నో ప్రాణాలు పోతున్నాయని, భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఐల్యాండ్‌లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రేడియం బ్లింకర్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి ప్రమాదాలపై క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోజు జరుగుతున్న ప్రమాదాలను గుర్తు పెట్టుకుని ప్రజల్లో భద్రతపై అవగాహన చేస్తున్నట్టు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రమాదాలకు ప్రధాన కారణమని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ చెప్పారు. ప్రమాద రహిద రామగుండం కమిషన రేట్‌గా నిర్మించేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుం టున్నారని, విద్యార్థులు, యువతకు రోడ్డు భద్ర తపై అవగాహన పెంపొందించడమే కాకుండా ట్రాఫిక్ నియమాలను, పాటించాల్సిన నియమాలను స్పష్టం చేస్తున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రోడ్డు సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, హెచ్‌కేఆర్ రోడ్ వేస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రామగిరి మండలం బేగంపేటకు చెందిన కొట్టే నిర్మల గ్రామ శివారు సర్వే నెంబర్ 568ఏ, బీలో మూడెకరాల 4 గుంటల భూమి 1993లో కొనుగోలు చేసి, 2017-18లో సాదాబైనామా కింద పట్టా చేసుకున్నామని, అసలు పట్టాదారు భూమిపై కేసు వేశారని, మోఖా పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేయాలని దరఖాస్తు చేసుకోగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. బొంపల్లికి చెందిన శెట్టి నరసయ్య అప్పన్నపేట శివారు సర్వే నెంబర్ 209లో ఉన్న భూమి మనుమరాళ్ళు శెట్టి ప్రవళిక, సుస్మితకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశానని, వృద్ధాప్యంలో సహాయం చేయడం లేదని, తన భూమి తిరిగి ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా ఆర్డీవోకు రాశారు. పెద్దపల్లి పట్టణం చందపల్లికి చెందిన అనూష ఇంటర్మీడియట్ పూర్తి చేశానని, అంగన్వాడీ టీచర్ పోస్టు ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాశారు. పెద్దపల్లి మండలం గుర్రంపల్లికి చెందిన సంధ్య ఇందిరమ్మ ఇండ్లు మంజూరైందని, పునాది వరకు పనులు పూర్తి చేశామని, బిల్లు విడుదల చేయాలని దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్‌కు రాశారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



కలెక్టరేట్ ఎదుట బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ యాసంగి బోనస్ బకాయిలు చెల్లించకపోవడంతోపాటు, ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, పంట చేతికొచ్చి మార్కెట్‌కు సిద్ధంగా ఉన్నా, కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతులు పత్తి అమ్ముకునేందుకు కపాస్ మొబైల్ యాప్ వినియోగించాలన్న నిబంధన సడలించాలని, రైతులు పత్తి ఎప్పుడు తీసుకువస్తే అప్పుడు కొనుగోలు చేసే అవకాశం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న యాసంగి వడ్ల బోనస్‌ను విడుదల చేయాలని, కొనుగోలు కేంద్రాలను తక్షణమే పూర్తిస్థాయిలో ప్రారంభించి రైతులకు అండగా నిలవాలన్నారు. జిల్లా కార్యదర్శి మౌట్టం నర్సింగం, శివంగారి సతీష్, సోషల్ మీడియా కన్వీనర్‌లు ఆకనపల్లి క్రాంతి, వెల్లంపల్లి శ్రీనివాస్‌రావు, శిలావేరు ఓదెలు, జంగా చక్రధర్ రెడ్డి, భూషణవేణి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

మాస్టిన్ కులస్తులకు భూమి కేటాయించాలి



భూమిని చదును చేస్తున్న మాస్టిన్ కులస్తులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నిరుపేదలైన మాస్టిన్ కులస్తులకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం భూమి కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని మాస్టిన్ కుల రాష్ట్ర అధ్యక్షుడు దంతనపల్లి చిన్నస్వామి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పాండవుల గుట్ట సమీపంలోని సర్వేనెంబర్ 597లోని ప్రభుత్వ భూమిలో ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని నిరసనకు దిగి భూమిని చదును చేశారు. ఆయన మాట్లాడుతూ తమ కులస్తులకు స్థలంలేక ఇబ్బందులు పడుతున్నామని, 60 కుటుంబాల వారంతా ఇరుకు ఇళ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యేతోపాటు జిల్లా అధికారులు స్పందించి స్థలం, ఇళ్లు కట్టుకునేలా ఆర్థిక సహకారం అందించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ధర్మయ్య కులసంఘం సభ్యులు అజయ్, రాజయ్య, గోపితోపాటు పలువురు మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికుడి మృతి

ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదం...

విద్యార్థిని చేయికి తీవ్ర గాయాలు..

6

ఖాళీ స్థలాలతో ప్రజలకు ఇక్కట్లు..

- ఎవరూ పట్టించుకోకపోవడంతో పెరుగుతున్న చెట్ల పొదలు
- ప్రకటనలతో సరిపెట్టుకుంటున్న కార్పొరేషన్
- 5వేలకుపైగా ఖాళీ ప్లాట్లు ఉన్నట్లు అంచనా...



అడ్డగుంటపల్లి చెరువులో ఇండ్ల మధ్యలో నిలిచిన నీరు

కోల్‌సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలు ప్రజలకు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. పలు అభివృద్ధి చెందుతున్న కాలనీలు, శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిచారు. అందులో చెరువులు, కుంటలు కూడా ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలోని అడ్డగుంటపల్లి చెరువు, సంజయ్‌గాంధీనగర్, భరత్‌నగర్, శాంతి నగర్, అడ్డగుంటపల్లి, రాజీవ్‌నగర్, మార్కండేయ కాలనీ ఏరియా, ఆర్‌టీసీ కాలనీ, శారదానగర్, రాజ్యలక్ష్మికాలనీ, సప్తగిరికాలనీ, పవర్‌హౌస్‌కాలనీ, మల్కాపూర్ రోడ్, శ్రీనగర్‌కాలనీ, ఎన్‌టీపీసీ అన్నపూర్ణకాలనీ, మాతంగి కాలనీ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. కాలనీల్లో ఇండ్ల మధ్యన ఉన్న గుంతలుగా మారిన ఖాళీ ప్లాట్లలో నీరు పెద్ద ఎత్తున చేరి కుంటలను తలపిస్తుంది. చాలా ప్రాంతాల్లో తుమ్మ పొదలు పెరిగాయి. దీంతో పందుల పెంపకానికి ఆవాసాలుగా మారాయి. ఖాళీ స్థలాల్లో అపరిశుభ్ర వాతావరణంతో దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో 7వేలకుపైగా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు రాగా అందులో 5వేలకుపైగా ఖాళీ ప్లాట్లే ఉన్నాయి. చాలా కాలనీల్లో ఇండ్ల యజమానులు పొరుగునే ఉన్న ప్లాట్లను శుభ్రం చేయాలని యజమానులకు చెప్పినా స్పందించడం లేదు. రామగుండం నగరపాలక సంస్థ యేటా ఖాళీ స్థలాల్లో చెట్ల పొదలను తొలగించాలని ప్రకటనలిచ్చి చేతులు దులుపుకుంటుంది. ఇటీవల కాలంలో నోటీసులు కూడా జారీ చేసింది. జమ్మికుంట పట్టణంలో ఇదే తరహాలో ఇబ్బందులు ఎదురైతే మున్సిపల్ అధికారులు ఖాళీల స్థలాల వద్ద ప్రభుత్వ స్థలంగా బోర్డు పెట్టారు. దీంతో స్థల యజమానులు హుటాహుటిగా వచ్చి శుభ్రం చేశారు. పలు మున్సిపాలిటీల్లో మున్సిపల్ యంత్రాంగం శుభ్రం చేసి ఖర్చులు, జరిమానాలు సంబంధిత యజమానులకు విధించింది. రామగుండంలో కూడా యంత్రాంగం కఠినవైఖరి అవలంబిస్తేనే ఈ సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

చలిలో చన్నీటి స్నానాలు



సుల్తానాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థులు నిత్యం చన్నీటి స్నానం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో కొన్నేళ్ళుగా చన్నీటి స్నానాలే చేస్తున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. వేడి నీటి ఏర్పాట్లపై అధికారులు పట్టించుకోవడం లేదని వారు పేర్కొంటున్నారు. అశోక్‌నగర్‌లోని ఎస్సీ హాస్టల్ ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి పీజీ వరకు చదువుతున్నారు. ఇందులో సుమారు 70 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా చలిలో ఇబ్బందులు పడుతూ స్నానాలు చేస్తున్నారు. వసతి గృహంలో గీజర్లు లేవని తెలిపారు. ఉన్నతాధికారులు హాస్టల్ సందర్శించి ఇబ్బందులు పట్టించుకోవాలన్నారు. వెంటనే గీజర్లు ఏర్పాటు చేయాలన్నారు.

● చన్నీటి స్నానాలతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని హాస్టల్ వార్డెన్ మేకల అంజయ్య అన్నారు. జ్వరాలు, దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో బంక అరుణ్(23)అనే యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలరూరల్ ఎస్సై ఉమాసాగర్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికిచెందిన బంక అరుణ్ తనస్నేహితులైన అజయ్, విష్ణుతోకలిసి బైక్‌పై శెకల్ల గ్రామం నుంచి జగిత్యాల వైపు పనినిమిత్తం వస్తున్నారు. ఈ క్రమంలో జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోగల చిన్నగట్టు వద్ద గంగాధర ప్రాంతానికి చెందిన కారు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనగా బైక్‌పై వెనుక కూర్చున్న బంకఅరుణ్ అక్కడిక్కడే మృతిచెందాడు. అజయ్, విష్ణులకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. వీరిని మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి బంక శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● ఇద్దరి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది..

రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అజయ్, విష్ణులకు 108సిబ్బంది ఈఎంటీ మంచాల మానస, పైలట్‌రాజు అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స నిర్వహించి తక్షణమే ప్రభుత్వఆస్పత్రికి తరలించి ఇద్దరి ప్రాణాలను కాపాడారు. బాధితకుటుంబసభ్యులు 108సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో.. యువకుడి దుర్మరణం



శ్రీనివాస్(ఫైల్)

తిమ్మాపూర్ : మండలంలోని రామకృష్ణ కాలనీ వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కళ్లెం శ్రీనివాస్(18) మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. రామకృష్ణ కాలనీకిచెందిన కళ్లెం శ్రీనివాస్ ఐటీఐ చదువు తున్నాడు. సోమవారం స్థానిక శివాలయంలో పూజచేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు అతివేగంగా వచ్చినటిప్పర్ బైక్‌నుఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న శ్రీనివాస్ టిప్పర్ వెనక టైర్లకింద పడిపోయాడు. టిప్పర్‌టైర్లు శ్రీనివాస్ తలపై, ఛాతీపైనుంచి వెళ్లాయి. శ్రీనివాస్ తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏడేళ్లక్రితం శ్రీనివాస్ తండ్రి కూడా రామకృష్ణ కాలనీ వద్దే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్ శివారులో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఆటోఢీ కొట్టిన ఘటనలో తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య(73) మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య తన ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పని నిమిత్తం కేశవపట్నం వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తాడికల్‌లోని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వెనుకనుంచి ఆటోడ్రైవర్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో గట్టయ్య రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొని, పక్కనఉన్న ట్రాక్టర్ కల్టివేటర్‌పై పడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గట్టయ్య కూతురు కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కన్నుమూత

పెద్దపల్లి రూరల్ : మండలంలోని రాఘవ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి స్టేజీవద్ద కారు ఢీకొని సింగ రేణి రిటైర్డ్ కార్మికుడు మృతిచెందాడు. పెద్దపల్లిరూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చొప్పల నాగరాజు(72) కుమారునితో సోమవారం పెద్దపల్లిలో కొనుగోలు చేసిన భూమిని చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. గొల్లపల్లి స్టేజీ వద్ద వాహనాన్ని యూటర్న్ చేస్తున్న క్రమంలో గోదావరిఖని నుంచి పెద్దపల్లికి వస్తున్న కారు ఢీకొనడంతో నాగరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారునికి గాయాల య్యాయి. సంఘటనస్థలాన్ని ట్రాఫిక్‌సీఐఅనిల్‌కుమార్, రూరల్‌పోలీసులు పరిశీలించి మృతదేహన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్యలక్ష్మీ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐమల్లేష్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి



బుచ్చవ్వ(ఫైల్)

తంగళ్లపల్లి : రోడ్డుపక్కన బస్సు కోసం వేచి ఉన్న మహిళను కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందగా కారు డ్రైవర్ గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండలకేంద్రం ఇందిరానగర్‌కు చెందిన ముగ్దం బుచ్చవ్వ(55) కూరగాయలు విక్రయిస్తూ జీవనం గడుపుతోంది. సోమవారం తెల్లవారుజామున తంగళ్లపల్లిలోని బస్టాండ్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బస్సు కోసం వేచి ఉండగా సిద్దిపేట వైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో హైదరా బాద్‌కు చెందిన కారు డ్రైవర్ మోమన్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ వారిని 108వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. బుచ్చవ్వ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి జైలు వార్డెన్ దుర్మరణం

ఓదెల, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తారకరామ కాలనీ వద్ద ఉన్న 32వ రైల్వే గేటు సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం పరకాల సబ్‌జైల్ వార్డెన్ నాగపూరి రాకేష్ రైలు నుంచి పడి మృతిచెందాడు. వరంగల్ చింతలపల్లిలో నివాసముంటున్న రాకేష్ పెద్దపల్లిలో జరిగిన మిత్రుడి వివాహానికి హాజరయ్యాడు. అనంతరం తిరుగు ప్రయాణం కోసం కాజీపేట్‌కు వెళ్లేందుకు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రాకేష్ ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు.



'షీ లీడ్స్' శిక్షణ తరగతులకు హాజరైన మహిళా కానిస్టేబుళ్లు



ధర్నాలు, నిరసనలు, ఆందోళనల సందర్భంలో నిరసనకారులను అడ్డుకోవడంలో శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లు

మహిళా కానిస్టేబుళ్లకు షీ లీడ్స్

● ఇప్పటికే బ్లూకోల్ట్స్ విధుల్లో మహిళా పోలీసులు

● కరీంనగర్‌లో పోలీసింగ్ సంస్కరణలు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మేమున్నాం' అనే ధైర్యాన్ని, భరోసాను మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తున్నారు కరీంనగర్ పోలీసు కమీషనరేట్‌లోని మహిళా పోలీసులు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో 'షీ లీడ్స్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదివరకు మహిళా కానిస్టేబుళ్లు ఆఫీస్ విధులకే పరిమితమయ్యేవారు. విజిబుల్ పోలీసింగ్‌లో వారి భాగస్వాములను చేసేందుకు మహిళా కానిస్టేబుళ్లకు బ్లూ కోల్ట్స్ విధులు కేటాయిస్తున్నారు. ఈ విధానం ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. ప్రజలకు భద్రతపై మరింత దృఢమైన నమ్మకాన్ని కల్పించడంలో మహిళా బ్లూ కోల్ట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సంఘటనలు ఎదురైనప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేలా మహిళా పోలీసులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు 'షీ లీడ్స్' కార్యక్రమాన్ని రూపొందించి శిక్షణను ప్రారంభించారు.

● క్షేత్ర స్థాయి సమస్యలపై శిక్షణ...


పోలీస్ శాఖలో విధులు నిర్వహించేవారు శారీరక దృఢత్వంతో పాటు మానసికంగానూ దృఢంగా ఉండాలి. మహిళా పోలీసులు వారిని వారు రక్షించుకునే స్థితిలో ఉన్నపుడే ప్రజలను రక్షించగలరనే ఉద్దేశంతో వంద మందికి (షీ టీంల సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం కోసం కరాటే (అన్ ఆర్మ్ కంబాట్ కోర్స్)లో శిక్షణ ఇస్తున్నారు. ధర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను ఎలా సమర్థంగా, మానవీయంగా నిర్వహించాలో నేర్పిస్తున్నారు. మానసిక ఒత్తిడి అధిగమించేందుకు, క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు, పోలీసులకు మానసిక దృఢత్వాన్ని పెంచేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు.

షీ లీడ్స్ కార్యక్రమంతో ప్రజలకు మరింత దగ్గరగా.



మహిళా పోలీసుల సేవలను కార్యాలయానికే పరిమితం చేయకుండా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు షీలీడ్స్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. మహిళా బ్లూ కోల్ట్స్ బృందం వీధుల్లో తిరుగుతుంటే, తమకు రక్షణ ఉందనే ధైర్యం, ఆత్మవిశ్వాసం మహిళల్లో మరింత పెరుగుతుంది. ఈ శిక్షణ ద్వారా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది.

- గౌస్ ఆలం, కరీంనగర్ పోలీస్ కమిషనర్



విద్యార్థిని చేతికి తీవ్ర గాయాలు

ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

కోల్‌సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం ఓదెల మేఘన(16)అనే ఇంటర్ విద్యార్థిని బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో ఆమె చేయిపై నుంచి బస్సుటైర్ వెళ్లి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. ఎన్‌టీపీసీ కృష్ణనగర్‌కు చెందిన మేఘన గోదావరిఖని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. గోదావరిఖని బస్టాండ్ నుంచి ఎఫ్‌సీఐలోని ఇంటికి వెళుతున్న సమయంలో కరీంనగర్-2 డిపోకు చెందిన బస్సు ఎక్కుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గోదావరిఖని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.

ట్రాలీ - ద్విచక్ర వాహనం ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ శివారులో సోమవారం ట్రాలీ, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన అజయ్ ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్తున్న ట్రాలీ ఎదురెదురుగా ఢీకొంది. ట్రాలీ బోల్తాపడటంతో పాటు ద్విచక్రవాహన దారునికి తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అతనితోపాటు ట్రాలీ డ్రైవర్‌కు గాయాలైనట్లు తెలిపారు. ఈ సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కూతురి హత్య కేసులో తండ్రి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన కూతురి హత్య, కొడుకుపై హత్యాయత్నం కేసులో వారితండ్రి అనవేణి మల్లేష్(38)ని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జాన్‌రెడ్డి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన అనవేణి మల్లేష్ 15ఏళ్లుగా నగరంలోని వావిలాలపల్లి వాసవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. హమాలీ పనిచేసుకుంటూ భార్య పోసవ్వ, దివ్యాంగులైన కూతురు హర్షిత, కొడుకు హర్షిత్‌ను పోషించుకుంటున్నాడు. ఆ ఇద్దరు పిల్లలు చిన్నవయస్సు నుంచి మానసిక, శారీరక అంగ వైకల్యంతో బాధపడుతున్నారు. చికిత్సకోసం అనేక ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించారు. పిల్లల ఆరోగ్య, మానసిక పరిస్థితిలో మార్పు రాలేదు. పిల్లల పరిస్థితి జీవితాంతం మారదని వైద్యులు స్పష్టం చేయడంతో నిందితుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఘాతుకానికి పాల్పడ్డాడు.

● ఘటన జరిగిన తీరు..

ఈ నెల 15న మధ్యాహ్నం నిందితుడి భార్య మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో మల్లేష్ మొదట కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి పిల్లలకు ఇవ్వడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. అనంతరం ఒక కాటన్ టవల్‌ను రెండు ముక్కలు చేసి వాటితో కూతురు(హర్షిత), కొడుకు (హర్షిత్) మెడకు ఉరివేశాడు. దీంతో కూతురు మరణించగా, కొడుకు స్పృహ కోల్పోయాడు. అనంతరం మల్లేష్ టవల్ ముక్కలను బయట పారేసి ఇంటినుంచి పారిపోయాడు. ఘటన తర్వాత నిందితుడు అదే సాయంత్రం కరీంనగర్ నుంచి హైదరాబాద్ జేబీఎస్‌కు చేరుకున్నాడు. అక్కడ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. మరుసటి రోజు మంచిర్యాలకు వెళ్లి అక్కడ తిరుగుతూ పోలీసుల భయంతో తలదాచుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఉదయం కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లేష్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడి మొబైల్‌ఫోన్, రెండు బస్‌టికెట్లు, హత్యకు ఉపయోగించిన రెండు కాటన్ టవల్ ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

బట్టల షాపులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టుచౌరస్తా సమీపంలోని మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో సోమవారం వేకువజామున 3గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈప్రమాదంలో కోటి రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు అంటుకోగా స్థానికులు అందించిన సమాచారంతో కరీంనగర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది తెల్లవారు జామున 3 గంటలకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కరీంనగర్, మానకొండూర్ ఫైర్‌ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే షాపులో ఉన్న బట్టలు, ఫర్నిచర్, ఏసీలు దగ్ధమయ్యాయి. షాపు యజమాని సంగం రాజేశం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి అరెస్టు

సారంగాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లైంగికదాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల మేరకు సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన బాపు(48) అనేవ్యక్తి బాలిక ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి కొద్దిరోజుల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో చిన్నారి ఏడ్చుకుంటు ఇంటికి వెళ్లగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగిత్యాల సీఐ సుధాకర్, ఎస్ఐ గీత నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

జ్యోతినగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీపీసీ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద రోడ్డుపై ఓ వ్యక్తి పడి పోయాడు. దీంతో అక్కడివారు 100కు డయల్‌చేసి విషయం చెప్పగానే విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ నవీన్ రావు అక్కడికి చేరుకుని, ప్రమాదవివరాలు సేకరించిబాధితుడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపదలో ప్రజలు వందకు డయల్‌చేస్తే పోలీసులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. వెంటనే స్పందించి, బాధితుడిని ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుల్‌ను ఎస్ఐ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చల్లూరుకు చెందిన ఎండీ అహమ్మద్దీన్ ఏప్రిల్ 1న కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ములుగులో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రూరల్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి సెల్ ఫోన్‌ను బాధితుడికి అందజేశారు.

ఫ్యాన్సీ నంబర్లు మరింత ప్రియం

● భారీగా రుసుమును పెంచిన ప్రభుత్వం

తిమ్మాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసిన వారిలో కొందరు వారికి కలిసి వచ్చే నంబర్లను దక్కించుకునేందుకు ఎంతైనా డబ్బులు వెచ్చిస్తారు. అవసరమైతే వేలంలో పాల్గొని అయిన వాటిని చేజిక్కించుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నంబర్ల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాలకు ఇచ్చే ప్రత్యేక (ఫ్యాన్సీ) నంబర్ల రిజర్వేషన్ కోసం ప్రస్తుతం తీసుకుంటున్న రుసుమును భారీగా పెంచింది. తెలంగాణ మోటారు వాహనాల రూల్స్ 1989లోని నియామలు, నిబంధనలను సవరిస్తూ తుది నోటిఫికేషన్‌ను జారీ చేసింది. పెంచిన రెట్లు, నంబర్లను నోటిఫికేషన్‌లో పొందుపరిచింది.

● నంబర్ల రిజర్వేషన్‌కు చెల్లించాల్సిన రుసుము

☑ 9999 నంబరు కావాలనుకునే వారు 1.5 లక్షల రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ మొత్తం 50 వేలు రూపాయలుగా ఉండేది.

☑ 1, 9, 6666 ఈ నంబర్లు కావల్సిన వారు లక్ష రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

☑ 99, 999, 3333, 4444, 5555, 7777 నంబర్లు కావల్సిన వారు 50,000 రూపాయలు చెల్లించాలి.

☑ 5, 6, 7, 123, 333. 369, 555, 666, 777, 1111, 1116, 1234, 2222, 2277, 2345, 2727, 3339, 3366, 3456, 3699, 4455, 4545, 4599, 6669, 6789, 4455, 4545, 4599, 6669, 6789, 8055, 8888 నంబర్లు కావాల్సిన వారు 40 వేల రూపాయలు చెల్లించాలి.



తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం

(5) 3, 111, 234, 567, 1188, 1818, 1899, 1999, 2799, 3636, 3999, 5678, 5999, 6999, 7999, 9009 నంబర్లు కావాల్సిన వారు 30 వేల రూపాయలుచెల్లించాలి.

(6).2, 4, 8, 11, 18, 27, 36, 39, 45, 55, 77, 143, 222, 405, 444, 456, 459, 786, 789, 909, 1112, 1122, 1212, 1233, 1269, 1314, 1359, 1889, 2223, 2255, 2259, 2349, 2525, 3335, 3344, 3399, 3555, 3789, 3888, 3969, 4446, 4554, 4567, 4777, 4959, 5445, 5559, 5589, 5599, 5666, 5679, 5859, 6336, 6699, 6777, 6786, 6969, 7779, 7799, 7979, 8889, 8899, 8999, 9099 నంబర్లు కావాల్సిన వారు 20వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వ్ చేసుకోవాలి.

ఇవి కాకుండా మిగతా ఏ నంబర్ కావాలన్నా ద్విచక్ర వాహనదారులు మూడు వేలు, కార్లు, ఇతర వాహనాదారులు ఆరు వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

● నిబంధనలు..

నంబర్ల రిజర్వేషన్‌కు సంబంధిత రవాణా శాఖ పోర్టల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

☑ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన బిడ్‌లను పరిశీలిస్తారు.

☑ ఒకే నంబరుకు ఒకటి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే వారిలో అత్యధిక బిడింగ్ వేసిన వారికి నంబర్‌ను కేటాయిస్తారు.

☑ దరఖాస్తుదారుడు బిడ్ సమర్పించకపోతే చెల్లించిన రుసుమును తిరిగి ఇవ్వరు. రిజర్వేషన్ చేసుకుని వేలంలో పాల్గొన్నా నంబర్ రాకపోతే కట్టిన రుసుములో 10శాతం మినహాయించుకుని మిగతా మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు.

ర్యాష్ డ్రైవింగ్.. మారని డ్రైవర్ల తీరు

● రోజుకో రోడ్డు ప్రమాదం

● పలువురికి గాయాలు

మానకొండూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్‌తో రోజుకో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటోంది. కొంత మంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటుండగా మరికొంతమంది గాయాలతో బయ టపడి నరకయాతన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ, లారీ డ్రైవర్ల తీరు మారడం లేదని ప్రయాణికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు రోజుకు సుమారు 15ట్రిప్పులు ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తాయి. దీంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, వీణవంక, జమ్మికుంట మండలాలకు చెందిన పలు వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు మండలంలోని ఊటూరులోని మానేరు వాగు, వీణవంక మండలంలోని కోర్కల్, మల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని మానేరు వాగు నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, హైదారాబాద్ తదితర పట్టణాలకు తిరుగుతాయి. ఇసుక లారీలు పోటీ పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. మండలంలోని అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అక్కడ రోడ్డు గుంతలమయంగా మారింది. అయినప్పటికీ సోమవారం ఇరువైపులా ఆర్టీసీ బస్సు-లారీ డ్రైవర్లు ఒకదాని వెనుక ఒకటి అతి వేగంతో పోటీ పడడం కనిపించింది. దీంతో బస్సులోని ప్రయాణికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద ముందు ఉన్న లారీని వెనకాల నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమారు 15 మందికి గాయాలయ్యాయి. వేగంగా వెళ్లవద్దని విజ్ఞప్తి చేసినా సదరు ఆర్టీసీ డ్రైవర్ వినిపించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.



అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వంతెన దగ్గర ర్యాష్ డ్రైవింగ్‌తో వెలుతున్న బస్సు-లారీలు

పుస్తెల తాడు లాక్కెళ్లిన దొంగ అరెస్టు



దొంగను అరెస్ట్ చూపిస్తున్న టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన దొంగను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దొంగను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని మోహర్‌నగర్‌కు చెందిన గాదెరాణి అనే వృద్ధురాలు ఇంటిలో ఒక్కతే తలుపు దగ్గర పెట్టుకుని పడుకుని ఉండగా శాంతినగర్‌కుచెందిన మెరుగు భాస్కర్ అనేవ్యక్తి 15వతేదీన మధ్యాన్న సమయంలో తలుపులు తీసుకుని లోపలికి వచ్చి రాణి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడుతోపాటు రెండు గుండ్లు పట్టుకుని పారిపోయాడు. రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల అధారంగా భాస్కర్ అనే దొంగను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. దొంగించిన సొమ్మును అమ్ముకోగా వచ్చిన డబ్బులు జల్సాలకు వాడుకోగా మిగిలిన డబ్బులను సీజ్ చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

జమ్మికుంట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయ మాటలు చెప్పి వివాహం చేసుకున్న ఓ యువకుడు ఆమెను గర్భిణిని చేసి ఇంటినుంచి బయటకు గెంటేయగా పోలీసులు అతడిపై పోక్సోకేసు నమోదు చేశారు. జయశంకర్ భూపాలపల్లిజిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లిలో చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జమ్మికుంట మండలం పాపక్కపల్లికి చెందిన బాలిక తండ్రి ఏడేళ్లక్రితం మృతిచెందాడు. అప్పటినుంచి తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరైన పెద్ద కోమటిపల్లిలో ఉంటోంది. అదేగ్రామానికి చెందిన వంశీ సదరు బాలికకు మాయమాటలు చెప్పి ఈ ఏడాది మేలో పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్న, కానుకల కింద ఎకరం భూమి, నాలుగుతులాల బంగారం ఇచ్చారు. కొద్దినెలలు కలిసిఉన్న తర్వాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. భర్తతోపాటు అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధింపులకు దిగారు. పలుమార్లు పెద్దలసమక్షంలో పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. తనను మోసగించి వివాహం చేసుకొని గర్భిణిని చేశాడని బాలిక గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కార్యదర్శి వెంటనే పోలీస్‌లకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు పోక్సోచట్టం కింద యువకుడి పై కేసు నమోదు చేశారు. బాలికను సఖీ కేంద్రంలో చేర్పించారు.

రాత్రివేళ చెరువులో బావి తవ్వకం

● గ్రామస్థుల ఫిర్యాదుతో అడ్డుకున్న పోలీసులు

చందుర్తి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన వ్యక్తి రాత్రివేళలో చెరువులో అక్రమంగా వ్యవసాయ బావి తవ్విస్తుండగా గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు అడ్డుకున్నారు. చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్తచెరువులో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. కొత్త చెరువులో బావిని తవ్వించేందుకు మూడు రోజుల క్రితం జేసీబీ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో పనులు నిలి పివేశారు. సోమవారం రాత్రి బావి తవ్వేందుకు పనులు ప్రారంభించగా పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని పనులను నిలిపి వేశారు. చెరువులోనీరు ఉండటంతో ప్రస్తుతం తిమ్మాపూర్ ఆశిరెడ్డిపల్లి రామన్నపేట, అనంతపల్లి గ్రామాల్లో వ్యవసాయబావుల్లో, బోర్లలో నీటికొరత లేకుండా ఉంది. చెరువులో బావితవ్వడంతో భూగర్భజలాలు ఇంకిపోయి బోర్లు అడుగంటే ప్రమాదంపొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చందుర్తి తహసీల్దార్ భూపతిని వివరణ కోరగా చెరువులో బావి తవ్వడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, చెరువుల్లో బావులు తవ్వరాదన్నారు. మంగళవారం బావిని తవ్వే ప్రాంతానికి సర్వేయర్‌ను పంపిస్తామని తెలిపారు.

పత్తి ఏరేందుకు వలస కూలీలు



నర్సక్కపేట గ్రామంలో పత్తి ఏరుతున్న ఆంధ్ర కూలీలు

● రైతుకు లాభదాయకం

● కర్నూలు కూలీలకు డిమాండ్

ఇల్లంతకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి ఏరేందుకు ఇల్లంతకుంట మండలానికి ప్రతి యేటా ఏపీలోని కర్నూలు నుంచి కూలీలు వస్తుంటారు. మండలంలోని నర్సక్కపేట, జవారిపేట, గాలిపెల్లి, కేసన్నపల్లె, పత్తికుంటపల్లె, ఆరెపల్లి తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా పత్తి సాగుచేస్తుంటారు. విత్తనాలు నాటిన నుంచి వర్షాలు వెంటాడటంతో పత్తి రైతులు కష్టాలు పెరిగిపోయాయి. పంటచేతికి అందివచ్చే దశలో మరోసారి కురిసిన వర్షాలతో పత్తి సాగు కష్టంగా మారింది. స్థానిక కూలీలు లభ్యం కాకపోవడం, కూలి, ఆటోకిరాయిలు కలుపుకొని ఒక్కొక్కరికి రూ. 450 వరకు ఖర్చు అవుతోంది. అయినా రోజుకు కేవలం 20కిలోలు మాత్రమే పత్తి ఏరుతున్నారని రైతులు వలస కూలీలను పత్తి ఏరేందుకు తీసుకువస్తున్నారు. ఈ యేడు ఏపీలోని కర్నూలు నుంచి 150మంది వలస కూలీలు నర్సక్కపేట గ్రామానికి చేరుకున్నారు. వారు నివాసం ఉండటానికి రైతుల కొట్టాలు ఇచ్చి విద్యుత్ సౌకర్యం కల్పించారు. వలస కూలీలు ఉదయం ఆరు గంటలకే చేనులోకి వెళ్లి సాయంత్రం ఆరు గంటల వరకు పత్తి ఏరుతారు. రైతులు కిలోకు రూ.15చెల్లించడమే కాకుండా ఆదివారం ఒక్కోకూలీకి పావుకిలో చికెన్ ఇస్తారు. వలస వచ్చిన కూలీలు ఎనమిది మంది కలిసి ఒక బ్యాచ్‌గా ఏర్పడి నివాసం ఉంటున్నారు. కర్నూలులో సరైన ఉపాధిలేకపోవడంతో వలస వచ్చామని వారు పేర్కొంటున్నారు. ప్రతిరోజు ఒక్కరు 50కిలోల వరకు పత్తి ఏరుతుంటారు. వర్షాల వల్ల పత్తి ఏరడం ఇబ్బందిగా మారిందని కూలీలు పేర్కొంటున్నరు. పత్తి ఏరడం పూర్తి అయిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతామని పేర్కొంటున్నారు. వీరితో పాటు ఇప్పటికే పలు గ్రామాలలో ఉన్న బీహార్ కూలీలు కూడా పత్తి ఏరుతున్నారు.

పనిదొరక ఇక్కడికి వచ్చాం

- జగతపుగారి మాణిక్యమ్మ, కోటికల్, కర్నూలు



పుట్టిన ఊరును వదిలిపెట్టి రావడం బాధగా ఉన్నా అక్కడ పనిలేకపోవడంతో పత్తి ఏరడానికి వచ్చాం. రెండు నెలల పాటు పత్తి, మిరప ఏరిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతాం. ఉదయం చేనులోకి వచ్చామంటే సాయంత్రం ఇంటికి వెలుతాం. కిలోకు రూ. 15చొప్పున రైతులు ఇస్తున్నారు. ప్రతి రోజు 50కిలోల పత్తి ఏరుతాం. కొట్టాలలో సరైన వసతులు లేకపోయినా సర్దుకుపోతున్నాం. కర్నూలు నుంచి వచ్చిన 150మందిమి నర్సక్కపేట గ్రామంలోనే ఉంటున్నాం.

కూలీ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం

- ఏలియరాజా, పెద్దకడూరు, కర్నూలు



కూలీపని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం. రెండు నెలలపాటు పత్తిఏరిన తర్వాత సంక్రాంతి పండుగకు ఇంటికి పోతాం. తర్వాత గుంటూరుకు మిర్చి ఏరడానికి పోతాం. పత్తి ఏరడమే కాకుండా ఇంటికి చేర్చే బాధ్యత కూడా మాదే. వర్షాలు పడటం వల్ల పత్తి ఏరడం కష్టంగా మారి సరైన కూలి పడటం లేదు. ప్రయాణ చార్జీలు రైతులే భరిస్తారు.

స్థానిక కూలీలు లభించకపోవడం వల్లనే

- కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నర్సక్కపేట



స్థానిక కూలీలు లభించకపోవడం వల్ల వలస కూలీలతో పత్తి ఏరిస్తున్నాం. స్థానిక కూలీలకు రూ. 350తోపాటు ఆటో కిరాయి ఇవ్వాల్సి ఉంటుంది. తక్కువ పత్తి ఏరడం వల్ల రైతులకు నష్టం జరుగుతుంది. వలస కూలీలు పత్తిని ఇంటివద్దకు చేరుస్తారు. వర్షాల వల్ల వలస కూలీల ధర కూడా పెరిగింది. ఈసారి పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సీసీఐ నిబంధనలలో కొంత సడలింపు ఇవ్వాలి.

కుటుంబ కలహాలతో భర్తను హతమార్చిన భార్య

● తల్లి సహాయంతో

గొంతుకు చున్నీ బిగించి హత్య

మల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో తల్లి సహాయంతో భర్తను హతమార్చిన ఘటన మల్లాపూర్ మండలం కొత్తధాంరాజుపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మందపల్లి భూమేష్(31) అనే వ్యక్తిని అతడి భార్య విజయ తన తల్లి లక్ష్మితో కలిసి గొంతుకు చున్నీ బిగించి హత్య చేసింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి అర్బన్ కాలనీకి చెందిన భూమేష్‌కు మల్లాపూర్ మండలం కొత్తధాంరాజుపల్లి గ్రామానికి చెందిన విజయతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. భూమేష్‌కు ఇది మొదటి వివాహం కాగా, భార్య విజయ్‌కు రెండో వివాహం. భూమేష్ మెట్‌పల్లిలో ఓ షాపులో పని చేస్తున్నాడు. కొంత కాలంగా భూమేష్ తాగుడుకు బానిసై ఇంట్లో ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో విజయ కొన్ని నెలల క్రితం తల్లి గారి ఊరైన కొత్తధాంరాజుపల్లి గ్రామానికి వచ్చి గది కిరాయి తీసుకొని ఉంటోంది. తరువాత కొంత కాలానికి భార్య విజయ వద్దకు భూహేష్ వచ్చి కొత్తధాంరాజుపల్లిలోనే కలిసి ఉంటున్నారు. ఆదివారం మత్యం మత్తులో భూమేష్ తన భార్య విజయను కొడుతుండగా ఆమె తల్లి లక్ష్మి అడ్డుకుంది. దీంతో భూహేష్ అత్త లక్ష్మిపై దాడికి యత్నించాడు. దీంతో విసుగు చెందిన విజయ, ఆమె తల్లి లక్ష్మిలు కలిసి భూమేష్ గొంతుకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. భూమేష్ ఇంటి బయట వాకిట్లో పడి చనిపోయాడని చెప్పి బయట పడుకోబెట్టారు. భూమేష్ మృతదేహాన్ని చూసిన బంధువులు ఘటనపై అనుమానం వ్యక్తం చేశారు. ఆర్ఐ రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భక్తులు

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ సోమవారం పెరిగింది. దీంతో స్థానికలక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వస్వామి, శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో కాశీ శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రుద్రాభిషేకం..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి, దర్శనం చేసుకున్నారు.

కోటిలింగాలలో కార్తీక సందడి..

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాలలో సోమవారం కార్తీక సందడి నెలకొన్నది. భక్తులు అధిక సంఖ్యలో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలారు. అనంతరం శ్రీపార్వతీ కోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులు దీపదానాలు చేయగా ఆలయఅర్చకులు నాగరాజుశర్మ స్వీకరించారు.

ఆలయచైర్మన్ పూదరి రమేష్, ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు



అండర్-17 బాలుర విభాగంలో రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి దాదాపు 240మంది క్రీడాకారులు పోటీపడ్డారు. గెలుపొందిన క్రీడాకారులకు వీర్ల హనుమంతరావు బహుమతులు ప్రదానం చేశారు. అండర్-17బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటి, మెదక్‌జిల్లా రెండో, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం, బాలుర విభాగంలో ఆదిలాబాద్‌జిల్లా మొదటిస్థానం, కరీంనగర్‌జిల్లా రెండోస్థానం, వరంగల్‌జిల్లా మూడోస్థానం సాధించాయి. అండర్-14బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటిస్థానం, కరీంనగర్ జిల్లా రెండోస్థానం, మెదక్ జిల్లా మూడవస్థానం, బాలుర విభాగంలో మెదక్‌జిల్లా మొదటిస్థానం, ఆదిలాబాద్‌జిల్లా రెండోస్థానం, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం సాధించాయి. అన్నివిభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రాజరాజేశ్వరి, పీడీ దత్తాద్రి, గ్రామకార్యదర్శి శ్యామ్, ఎస్‌జీఎఫ్‌సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వీర్‌పాల్‌రెడ్డి, శ్రీను, సత్యనారాయణ, రూపరాణి, రాజగోపాల్, రమేష్, హరికిషన్, రమణ, రాజ్‌కుమార్, పత్తి రాజిరెడ్డి, కృష్ణవేణి, స్వప్న, వనిత, అహ్మద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రశంసాపత్రంతో విద్యార్థి అమర్‌ను అభినందిస్తున్న హెచ్ఎం మధుమాలతీ, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పెద్దూరు అమర్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం మధుమాలతి సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈ నెల 16న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్(హైజంప్) అండర్- 14 విభాగంలో విద్యార్థి అమర్ అత్యంత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. వచ్చే నెల 4 నుంచి 7 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి అమర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీడీ అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు

జమ్మికుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు వాటిల్లుతుందని విస్తరణ సంచాలకుడు డాక్టర్ కిషన్‌కుమార్ అన్నారు. సోమవారం పీవీనరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రాలు, సత్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో పలు అంశాలపై కేవీకేలో రెండురోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటిబయోటిక్స్‌తో పశువులతోపాటు ప్రజలప్రాణాలకు ముప్పుతప్పదన్నారు. డాక్టర్‌వంశీకృష్ణ అధిక మోతాదులో వాడితే కలిగేనష్టాల గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ అంబిక పాకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ ఎమ్ కిషన్ కుమార్, డాక్టర్ బిందుమాధురి, డాక్టర్ సాయికిరణ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కిషన్ కుమార్

శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సోమవారం నీటి మట్టం నిలకడగాఉంది.ఎగువప్రాంతం నుంచి 9,355 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తినీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకుగాను ప్రస్తుతం80.501టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 9,355 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్లద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతోంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మెట్‌పల్లి గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన జక్కుల అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధర్మపురి, కోటిలింగాలలో వైభవంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి 27వరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్య ప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి పూజలు

కోటిలింగాలలో..

వెల్గటూర్: కార్తీకమాసం పురస్కరించుకొని కోటిలింగాల వద్ద గోదావరి హారతి కార్యక్రమం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, నాయకులు, భక్తులు, మహిళలు గోదావరినది వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మల మంత్రోచ్చరణల మధ్యగోదావరి మాతకు హారతి ఇచ్చారు. అంతకు ముందు శ్రీపార్వతీ కోటేశ్వరస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గోదావరి మాతకు పూజలు చేసి కార్తీకదీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, గుమ్ముల వెంకటేష్, మెరుగు శ్రీనివాస్, గంద్ర శ్రీకాంత్ రావు, మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు

● స్వామివారిని దర్శించుకున్న 50వేలకు పైగా భక్తులు ● కోడె మొక్కుకు 3గంటల సమయం



భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీభీమేశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు50 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించేందుకు కనీసం మూడు గంటల సమయం పట్టింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల పాలయ్యారు. భీమేశ్వరాలయానికి ఏ వైపు నుంచి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేకపూజలు చేశారు. నిత్య అన్నదానసత్రంపై అంతస్థులో కళ్యాణం, సత్యనారాయణ స్వామివ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు స్వామివారికి మహాలింగార్చన, కుంకుమ పూజలు, పెద్దపల్లకి సేవలు, ఆకు పూజలు చేసి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో రమాదేవి, డిఈఈ రఘునందన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టౌన్‌సీఐ వీరప్రసాద్, ఎస్ఐ ఎల్లాగౌడ్, ట్రాఫిక్ ఎస్ఐ రాజులు 50మంది పోలీసులచే బందోబస్తు నిర్వహించారు. కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, పరివారదేవతలకు అర్చనలు నిర్వహించారు. రాత్రి మహాలింగార్చన నిర్వహించారు.

ఎల్ఈడీ స్క్రీన్‌పై రాజన్న దర్శనం

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విస్తరణపనులు జరుగుతున్న సందర్భంగా తాత్కాలికంగా స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో సోమవారం తూర్పు వైపున ప్రచారరథంవద్ద ఏర్పరిచిన ఎల్ఈడీ స్క్రీన్‌పై భక్తులు రాజన్నను దర్శించుకున్నారు.

బద్దిపోచమ్మకు బోనాలు..

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం కిక్కిరిసిపోయింది. అమ్మవారి దర్శనానికి రెండుగంటలు పట్టింది. భక్తులు పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు.

● భక్తుల ఇబ్బందులు ..

స్వామివారి ఆర్జితసేవల టికెట్లకోసం పెద్ద ఎత్తున భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్దకు చేరుకున్నారు. కల్యాణ ప్రాంగణం సామర్థ్యం దృష్ట్యా కేవలం 79 టికెట్లను మాత్రమే జారీచేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అసహనానికి గురైన భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ అద్దాలు ధ్వంసం చేశారు. కార్తీకసోమవారం కావడంతో వందలాది వాహనాలతో భక్తులు వేములవాడకు చేరుకున్నారు. గుడిచెరువు పార్కింగ్‌స్థలం వాహనాలతో నిండిపోయింది. భీమేశ్వరాలయంలో ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్ద భక్తుల ఆందోళనతో ఆలయ ఈవో ఎల్. రమాదేవి తనిఖీలు నిర్వహించారు.



వేములవాడ పార్కింగ్‌లో వందలాది వాహనాలు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పంట మార్పిడితోనే అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. ప్రతిసారి వరిపంట వేయడం వల్ల భూమిలో సారం తగ్గి, ఎరువులపై ఆధారపడి రోగాల బారిన పడే అవకాశం పెరుగుతుందన్నారు. సారవంతమైన భూములు సౌడు భూములుగా మారుతున్నాయని, దీని కోసం సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆయిల్ పామ్ సాగు కోసం సబ్సిడీతో కూడిన డ్రిప్‌ను 90 శాతం ఇస్తుందన్నారు. చీడపీడల బెడద ఉండదని, తుఫాన్‌కు తట్టుకొని మంచి ఆదాయాన్ని పొందవచ్చని అన్నారు. పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందించారు. పీఏసీఎస్ చైర్మన్‌లు గోపు విజయభాస్కర్ రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్ రావు, ఏడీఏ శ్రీనాథ్, హార్టికల్చర్ శాస్త్రవేత్త భాస్కర్ రావు, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీఓ భాస్కర్ రావు, ఏఓ ఉమాపతి, అసిస్టెంట్ రిజిస్టర్ అనిల్‌కుమార్, మానిటరింగ్ అధికారి స్రవంతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంటలతో అధిక లాభాలు సాధించవచ్చని, రైతులు ఆ దిశగా అడుగులు వేయాలని నంది మేడారం ప్యాక్స్ చైర్మెన్ ముత్యాల బలరాం రెడ్డి కోరారు. రైతు వేదికలో వ్యవసాయ ఉద్యాన, సహకార శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 250 ఎక రాల్లో సాగవుతుందని, వచ్చే ఏడాది మరో 100 ఎక రాల్లో సాగుకు కృషి చేస్తామన్నారు. అంతర పంట లుగా మొక్కజొన్న, వేరుశనగ, పత్తి సాగు చేయవ చ్చని తెలిపారు. మండల ఉద్యాన విస్తరణాధికారి మహేష్ మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో రైతులకు మొక్కలు అందిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీ, సన్న చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో పంటకు డ్రిప్ సిస్టంను అందిస్తామని పేర్కొ న్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఏ.అఖిల, మల్లేష్, సామంతుల రాయమల్లు, మానిట రింగ్ అధికారి సత్యనారాయణ, హరీష్ పాల్గొన్నారు.

పంట మార్పిడితోనే రైతులకు లాభాలు

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): రైతులు ఒకే పంటను సాగు చేయడం ద్వారా భూమిలో సారం తగ్గుతుందని, పంటలు మార్పు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా రైతులకు సబ్సిడి విత్తనాలు, రుణాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు.



పెద్దపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, దేవునిపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆయిల్‌పామ్ సాగు చేసుకుంటే మూడు సంవత్సరాల అనంతరం రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, ఏవో అలివేణి, కాంగ్రెస్ నాయకులు నూగిల్ల మల్లయ్య, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ సురేందర్, కలబోయిన మహేందర్, మండల సత్యనారాయణరెడ్డి ,నందనవేన రాజేందర్, అరె సంతోష్, సీఈఓ తిరుపతి, పాల్గొన్నారు.

పెద్దపల్లిని అభివృద్ధి చేస్తా

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. తెనుగువాడ మండల ప్రాథమిక పాఠశాలలో 16 లక్షల రూపాయలతో తరగతి గదులు పట్టణంలోని 24 వ వార్డు ప్రభుత్వం హాస్పిటల్ పక్కన 14 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్, ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట మినీ ట్యాంక్ బండ్‌పై 13 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్, జూనియర్ కాలేజ్ మైదానంలో ఎస్‌డీఎఫ్ నిధులు రెండు కోట్లతో తరగతి గదుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ఏఈ సతీష్, ఎం ఈ ఓ సురేందర్, హెచ్చెమ్ శ్రీలత మాజీప్రజా ప్రతినిధులు నూగిళ్ళ మల్లయ్య, భూతగడ్డ సంపత్ అమ్రీష్, మున్సిపల్ సిబ్బంది మాజీ కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవునిపల్లిలో నీటి సమస్య పరిష్కరిస్తా

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): దేవునిపల్లిలో అనేక ఏళ్లుగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడుతానని ఎమ్మెల్యే విజయ రమణ రావు అన్నారు. సోమవారం రాత్రి రూ.10 లక్షలతో సీసీ రోడ్లు పనులు ప్రారంభించగా, 30 లక్షలతో చేపట్టనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే మండలస్థాయి అధికారులతో చర్చించి తాగునీటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దేవునిపల్లిలో ప్రసిద్దిగాంచిన నంబూలాద్రి స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు సమకూర్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో మహిళా సంఘ భవనం నిర్మిస్తామని చెప్పారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, సాగర్‌రావు, అజయ్, సతీష్, అట్ల కుమార్, హరికృష్ణ, పొలవేని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ డిపో పనులు షురూ..

(5వ పేజీ తరువాయి)

బస్సు రిపేర్ షెడ్, వాటర్ సర్వీసింగ్ ప్లాంట్, తదితర గదుల నిర్మాణాల కోసం ఆరు కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు ఒక కాంట్రాక్టర్ టెండర్లు దక్కించుకున్నారు. బస్ డిపో నిర్మాణ స్థలంలో వివిధ రకాల చెట్లు ఉండగా వాటిని తొలగించేందుకు ఆర్టీసీ అధికారులు టెండర్‌లను ఆహ్వానించారు. టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ చెట్లను తొలగిస్తున్నారు. ఈ పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. ఒకటి రెండు రోజుల్లో నరికి వేసిన చెట్ల తరలింపు పూర్తి కావస్తుందని అధికారులు తెలిపారు. ఆ వెంటనే నిర్మాణ స్థలంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలను కూల్చివేసి భూమిని చదును చేయనున్నారు. ఆ వెంటనే సిమెంట్ పనులను ప్రారంభించ నున్నారని అధికారులు తెలిపారు. బస్ డిపో పనులను ఎనిమిది మాసాల్లో పూర్తిచేసే ప్రయాణికులకు అందు బాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

బస్ డిపో ఆరంభమైతే పెద్దపలి నియోజకవర్గ పరిధి లోని సుల్తానాబాద్, ఎలిగేడు, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి, అలాగే ధర్మారం, వివిధ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కలగనున్నది. అంతేకాకుండా పెద్దపల్లిలో రైల్వే జంక్షన్ ఉండడంతో రైల్వే ప్రయాణికులకు కూడా బస్సు డిపో ఎంతగానో ఉపయోగపడనున్నది.

గురుకులాల పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

మంథని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, సౌకర్యాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బుక్కి వెంకటయ్య వెల్లడించారు. ప్రభుత్వ సాంఘిక గురుకుల ఆశ్రమ పాఠశాల, కళాశాలను ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో పలు విషయాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబాల విద్యార్థులు గురుకులాల విద్యను వినియోగించుకొని కష్ట పడి చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి రావాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఇంటర్, పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని సూచించారు. కమిషన్‌సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, కుస్రం నీలాదేవీ, జిల్లా శంకర్, అధికారులు రవీందర్, సురేష్, దేవసేన, కుమారస్వామి, రమేష్, ప్రిన్సిపాల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ రవిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ వెంకటయ్య

కోర్టు సమీపంలో ఉన్న బ్రాందీ షాపు తరలించాలి

ఓదెల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సివిల్ కోర్టు సమీపంలో ఉన్న బ్రాందీ షాపును తరలించాలని మత్స్య శాఖ సహకార సంఘం అధ్యక్షుడు మంద కొమురయ్యతో పాటు సభ్యులు సోమవారం అదనపు కలెక్టర్ వేణుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల హై స్కూల్, వసతిగృహాలు, మోడల్ హైస్కూల్‌కు సమీపంలో షాపు ఉండడం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధికారులకు ఇబ్బందిగా ఉందన్నారు. ఎక్సైజ్ సీఐ, తహసీల్దార్ కు కూడ ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి బ్రాందీ షాపును తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ వేణు

సుల్తానాబాద్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు, శాస్త్రీనగర్ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సాయంత్రం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనలకు అనుకూలంగా ఉన్న ధాన్యాన్ని తూకం వేసి, మిల్లులకు తరలించాలని తెలిపారు. సుల్తానాబాద్ సింగిల్ విండో పరిధిలో ఇప్పటి వరకు 45 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు జరిగినట్లు సీఈఓ బూరుగు సంతోష్ తెలిపారు. దీంతో నిర్వాహకులను అదనపు కలెక్టర్ అభినందించారు.

ఫ్లెక్సీలను తొలగించడంలో నిర్లక్ష్యం

పెద్దపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీలను తొలగించడంలో మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని బీజేపీ నాయకుడు తంగెడ రాజేశ్వర్ రావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 8న ఎమ్మెల్యే విజయరమణారావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని, సంబురాలు జరుపకొని వారం గడుస్తున్నా ఫ్లెక్సీలు తొలగించలేదన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాల ఫ్లెక్సీలను అప్పటికప్పుడు తొలగిస్తారన్నారు. సీసీ కెమెరాలకు అడ్డుగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు.

చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గణేష్

ఎలిగేడు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. సోమవారం ధూళికట్టలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా వచ్చి ప్రసంగించారు. న్యాయ విజ్ఞానసదస్సుల ద్వారా పాల్గొన్న జడ్జి, అతిథులు మాట్లాడే ప్రతి విషయాన్ని అర్థం చేసుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, కార్యదర్శి బోయిని భూమయ్య, లోక్‌అదాలత్ సభ్యులు సీనియర్ న్యాయవాది మాదూరి అంజనేయులు, న్యాయవాది జోగుల రమేష్, ఎస్‌ఐ మదుకర్, సామాజిక కార్యకర్త కొండ రవియాదవ్, గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కార్మికుడి కిడ్నాప్ కలకలం

రామగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో ఓసీపీ-2కు చెందిన కార్మికుడి కిడ్నాప్ వ్యవహారం సోమవారం కలకలం సృష్టించింది. ఓసిపి-1 ప్రాజెక్టు నుంచి ఓసిపి-2కు డిసిఎం వ్యాన్‌లో సామగ్రి తరలిస్తున్న క్రమంలో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిలో డిసిఎం వ్యాన్‌కు కారును అడ్డు పెట్టి నిలిపివేశారు. కారులో నుంచి దిగిన ఇద్దరు వ్యక్తులు వ్యాన్‌లో ఉన్న కార్మికుడిని కారులో ఎక్కించి తరలివెళ్ళారు. తొలుత కిడ్నాప్‌గా స్థానికులు భావించారు. సదరు కార్మికుడిపై కాకినాడలో నమోదైన కేసుపై వారెంట్ జారీ అయినట్లు తెల్సింది. పోలీసులు టూటౌన్‌లో ముందస్తుగా సమాచారంతోనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

వైభవంగా కార్తీక దీపోత్సవం

మంథని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో కార్తీక దీపోత్సవాన్ని సోమవారంరాత్రి వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం కార్తీక దీపాలను వెలిగించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి, గోదావరిఖని ఆధ్వర్యంలో మార్కండేయకాలనీలోని రాజ్యలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మామిడిపెల్లి శ్రీధర్ హాజరై మాట్లాడుతూ 42మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి ఆసుపత్రికి పంపించామన్నారు. కొల్లూరి విజేందర్, సతీష్, రాజేందర్, ప్రసాద్, సతీష్, జనార్ధన్ గౌడ్, మల్లికార్జున్, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కళ్యాణ్‌నగర్, ద్వారకానగర్‌లలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు హర్షిత్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యంతో ఆహార పదార్థాలతో గుండెపోటు వ్యాధులు వస్తున్నాయని, ప్రజలు దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, మధుమేహ వ్యాధి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మాజీ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, బొంగోని హరీష్, రమేష్ పాల్గొన్నారు.



పాత తేదీతో ప్రమోషన్లు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు వన్‌టైం సెటిల్‌మెంట్ పేరుతో మోసం చేయవద్దని, బ్యాక్ డేట్‌తో ప్రమోషన్లు ఇస్తేనే న్యాయం జరుగుతుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ మంద నరసింహారావు ప్రకటనలో పేర్కొన్నారు. ఏడేళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూసిన ఈపీ ఆపరేటర్లకు యాజమాన్య అసంపూర్ణ నిర్ణయం అశనిపాతమని తెలిపారు. ఈపీ ఆపరేటర్ డీ నుండి సీ గ్రేడ్ ప్రమోషన్లు ఎపుడు రావాల్సి ఉందో దానిని పరిగణలోకి తీసుకుని సీనియార్టీ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాక్ డేట్‌తో ప్రమోషన్లు అమలు చేయకపోవడం ద్వారా ఈపీ ఆపరేటర్లు కోల్పోయిన సీనియార్టీని తద్వారా ప్రొబెషనరీ పీరియడ్‌లో లేదా తర్వాత ప్రమోషన్లలో కోల్పోయే అవకాశాలను యాజమాన్యం పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈఎస్ఐ అమలుపై అవగాహన


కాంట్రాక్టర్లతో చర్చిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలోని కాంట్రాక్టర్లు, ప్రిన్సిపుల్ ఎంప్లాయిర్స్‌తో జీఎం బండి వెంకటయ్య ఈఎస్ఐ అమలుపై సమావేశం నిర్వహించారు. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ యాక్టు అమలు ద్వారా కాంట్రాక్టు ఉద్యోగులకు వర్తించే సదుపాయాలు, లాభాలను కాంట్రాక్టర్లు అమలు చేయాలని సూచించారు. ఉద్యోగుల సామాజిక భద్రత, వైద్య సదుపాయాలు, కుటుంబ సంక్షేమం దృష్ట్యా ఈఎస్ఐ చట్టం అమలు కీలకమని జీఎం పేర్కొన్నారు. ఈసమావేశంలో ఎస్వోటూ జీఎం రాముడు, పర్సనల్ ఏజీఎం అరవిందరావు, వివిధ విభాగాల అధికారులు షరీఫ్ మహమ్మద్, ప్రతాపగిరి రాజుతో పాటు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే విజయరమణరావు అన్నారు. సోమవారం అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అందుగులపల్లి, దేవునిపల్లి, రంగాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యంలో ఎలాంటి కోతలు విధించకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తుందని పేర్కొన్నారు. సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, కాంగ్రెస్ నాయకులు నూగిల్ల మల్లయ్య, రాజేందర్, మహేందర్, బొక్కల సంతోష్, తలారి సాగర్, లక్ష్మీరాజం,సింగిల్ విండో సీఈవో తిరుపతి, డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


కొనుగోలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

అంతర్గాం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంకితమైందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ జరుగుతుందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి అన్నారు. సోమవారం ఎక్లాస్‌పూర్, ఆకేనపల్లి, సోమనపల్లి, బ్రాహ్మణపల్లి, గోలివాడ, పెద్దంపేట తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు మద్దతు ధరతో 48 గంటల్లో ధాన్యం డబ్బులు వచ్చేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు, ఐకేపీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

అంతర్గాం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వే స్టేషన్ లోగల క్రూ లాబీ ఎదుట లోకో పైలట్ల సమస్యల పరిష్కరించాలని ఆల్‌ఇండియా రైల్వే ఫెడరేషన్ పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ రామగుండం బ్రాంచ్ చైర్మన్ రామారావు మాట్లాడుతూ లోకో పైలట్లను 36 గంటల్లోపు హెడ్ క్వార్టర్స్‌కు తిరిగి తీసుకురావాలని, రన్నింగ్ సిబ్బందిని ఇంటెన్సివ్ క్యాడర్‌గా పరిగణించాలని, రాత్రి విధులను గరిష్టంగా రెండు రాత్రులకే పరిమితం చేయాలని రైల్వే సంస్థను డిమాండ్ చేశారు. మజ్దూర్ యూనియన్ నాయకులు స్వామి, లోకోపైలెట్లు తదితరులు పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మించాలని వినతి

పెద్దపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామం తెనుగుపల్లి చిన్నవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని సోమవారం గ్రామానికి చెందిన బాలసాని లెనిన్ అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ 150 ఎకరాలకు పైగా రైతులు నిత్యం వ్యవసాయ పనులకు వాగు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వంతెన నిర్మాణం చేపడితే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. వెంటనే వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


గోడ ప్రతులతో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రస్తుతం చెడు వ్యసనాల ప్రభావం ఎక్కువగా ఉందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యలో రాణించాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి డి.కల్పన అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులకు పరీక్షలపై ఆమె అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా యోగా, ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. అనంతరం మత్తు పదార్థాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గోడ ప్రతులను విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు. కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ రాజేందర్, స్టూడెంట్ కౌన్సిలర్లు శంకర్, సంతోషిని, కుమారి, ధనలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బిల్లుల పంపిణీ

పాలకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు సోమవారం సంక్షేమ అధికారి మెండె సంపత్‌కుమార్ సబ్బు బిల్లులను పంపిణీ చేశారు. వసతి గృహంలో ఉన్న 30 మంది విద్యార్థులకు 27,125 రూపాయలను అందించినట్లు ఆయన తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య పాల్గొన్నారు. విద్యార్థులకు, గ్రంథ పాఠకులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చైర్మన్ సరస్వతీ మాతకు పూలదండ వేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు జిల్లా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలకు పలు పాఠశాలల నుండి 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా టీచర్లు సారయ్య, వెంకటస్వామి వ్యవహరించారు. గ్రంథాలయ కార్యదర్శి సరిత, టీచర్లు హుస్సేన్, గ్రంథాలయ జూనియర్ అసిస్టెంట్ గఫార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జిల్లాస్థాయి భగవద్గీత పోటీలు


గెలుపొందిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో జిల్లా స్థాయి భగవద్గీత పోటీలను సోమవారం ప్రారంభించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌కు చెందిన రాంరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కంఠస్థ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా బూర్ల లక్ష్మీనారాయణ, బీఎంఎస్ సీనియర్ నాయకులు అల్లెంకి వైకుంఠం, గాయతి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ రజనీదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన టీటీడీ కార్యకర్తలు, నిర్వాహకులు కుంబ అశోక్ కుమార్, మోగిని చంద్రశేఖర్‌రావు, పిట్టల స్వరూప రాణి, బూర్ల అంజలి, సబ్బు సతీష్‌లను అభినందించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మెకు సీఐటీయూ మద్దతు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సీఐటీయూ నాయకులు సోమవారం మద్దతు తెలిపారు. మూడు రోజులుగా అమరవీరుల స్థూపం వద్ద చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటని, విద్యార్థుల భవిష్యత్‌లో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. పెండింగ్ బకాయిలు విడుదల చేసి సమస్యలు తీర్చాలన్నారు.

రేపు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలు ఉంటాయని, జిల్లాలోని వృద్ధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంచరామిలో కోతుల బీభత్సం


కోతుల దాడిలో గాయపడిన కనకమ్మ

సుల్తానాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంచరామిలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం ఇంటి ముందు ఉన్న వీర కనకమ్మ అనే వృద్ధురాలిపై దాడి చేయడంతో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. ఆమెను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గతంలో ఇదే గ్రామంలో మోత్కూరు అమృత, చిక్కుడు సమ్మక్క, నగునూరి దేవేంద్రం, ఉప్పు లక్ష్మీ, భాగ్య, వీర మల్లమ్మ, భూత్కూరి నర్సయ్య, వీర సరోజన, రవీందర్, తిప్పారపు బూదమ్మ, సింగారపు విగ్నేష్ ఇలా పలువురిని కోతులు దాడి చేసి గాయపరిచాయి. ప్రజలు భయంతో ఇండ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కోతుల మంద ఇండ్లలో చొరబడి వస్తువులు, ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. కోతుల నివారణకు రిటైర్డ్ ఎస్పీ ఉప్పు తిరుపతి కొండెంగను తెప్పించారు. దానిని బైక్‌పై ఓ వ్యక్తి తిప్పుతూ కోతులను తరిమేవాడు. అతను మాని వేయడంతో కోతుల బెడద మళ్లీ పెరిగింది. అధికారులు స్పందించి కోతుల బెడద నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అల్లూరులో ఐకేపీ సెంటర్ ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అల్లూరులో వడ్ల కొనుగోలు కేంద్రం సోమవారం ప్రారంభమైంది. మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి స్థానిక రైతులతో కలసి వడ్ల కొనుగోలును ప్రారంభించారు. గత ప్రభుత్వం చేయలేని రైతు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ అమలు చేస్తుందని, పండించిన పంటకు గిట్టుబాటు ధరను ఇస్తూ, సన్న బియ్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు రాజిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, డివిజన్ అధ్యక్షుడు మార్క రాజు, రైతులు ఆరెల్లి శ్రీనివాస్, మల్లేష్, రాజయ్య, ప్రేమ్, శేఖర్‌లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్ రావు అన్నారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు పెన్నులు, పుస్తకాలను అందించారు. డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, పాత్రికేయులు పాల్గొన్నారు.